# గోదాంల భద్రతపై సమీక్షించాలి

- కేసీఆర్ హయాంలోనే తగినన్ని గోదాంల ఏర్పాటు
- సంరక్షణ బాధ్యతను విస్మరించడం వల్లే ఇలాంటి ఘటనలు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, ఏప్రిల్ 2 : రాష్ట్రం వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ గోదాంలలో జరుగుతున్న వరుస ఘటనలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన పెబ్బేరు మార్కెట్ గోదాంను మాజీ మంత్రి మంగళవారం పరిశీలించి మాట్లాడారు. కొన్ని రోజుల కిందట ఓ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పట్టపగలే ధాన్యం బస్తాలు చోరీకి గురైన ఘటన మరువక ముందే పెబ్బేరులో ఈ దుర్ఘటన జరుగడం విచారకరమన్నారు. ఈ ప్రమాద ఘటనకు కారణాలను అధికారులే తేల్చాలన్నారు. నిర్వహణ లోపాలుంటే సమీక్షించుకోవాలని, పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అధికారులు సమగ్ర అంచనా కలిగి ఉండాలని సింగిరెడ్డి అభిప్రాయపడ్డారు. వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా కేసీఆర్ హయాంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో నిల్వ గోదాంలను నిర్మించారని, వాటిని సంరక్షించే బాధ్యతను ప్రభుత్వం విస్మరించడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన విమర్శించారు.

### రాత్రంతా సహాయక చర్యలు

అగ్నిప్రమాదానికి గురైన గోదాంలో సహాయక చర్యలు సోమవారం రాత్రంతా కొనసాగాయి. అగ్నిమాపక సిబ్బంది శ్రమ కోర్చి మంటలను మంగళవారం ఉదయానికి అదుపు చేశారు. గోదాం గోడలను పగులగొట్టి కాలి బూడిదైన గన్నీ బ్యాగులను బయటకు తీశారు. పాక్షికంగా కాలిపోయి, తడిసి ముద్దయిన ధాన్యం బస్తాలను లారీల సహాయంతో బయటకు తరలించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి అధికారులతో సమీక్షించారు.

### విచారణకు ఆదేశించాం

పెబ్బేరు మార్కెట్ యార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి వరకు ఆయన సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదట సహాయక చర్యలపై దృష్టి పెట్టామని చెప్పారు. ప్రమాదం ఎలా జరిగిందో తేల్చేందుకు విచారణ జరిపి, వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 2 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అధికారులు గ్రామాల్లో ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తతో ఉండి తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇప్పటికి తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని వాటిని సక్రమంగా వినియోగించి తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూసుకోవాలన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు చిన్నారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎంపీపీ కృష్ణా నాయక్, జెడ్పీటీసీ సామ్యనాయక్ , అధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ, ఏప్రిల్ 2: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలోఅంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని చౌద క్రికెట్ లీగ్ సీజన్ -3 టోర్నీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు స్నేహ పూర్వక వాతావరణం కలిగిస్తాయన్నారు. ఓటమి గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగమ్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

### గెలుపోటములు సమానం

అయిజ రూరల్, ఏప్రిల్ 2: క్రీడలతో మానసికోల్లాసం చేకూరుతుందని బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య పేర్కొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని సంకాపురంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ప్రశాంతత ఉంటుందని తెలిపారు. క్రీడలను స్నేహాభావంతో ఆడుకోవాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఈశ్వర్, కృష్ణ, గోపాల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజ్ మెస్ ఇన్‌చార్జిపై విద్యార్థుల ఆగ్రహం

వనపర్తి, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో గతేడాది విద్యార్థులకు భోజనం అందించే కాంట్రాక్ట్ తీసుకున్న ఓ జర్నలిస్టు యూనియన్ నాయకుడి వేధింపులపై విద్యార్థులు కేసు పెట్టేందుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది. దీనిపై రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డిని వివరణ కోరగా గతంలో మెడికల్ కాలేజ్ మెస్ నడిపిన ఓ జర్నలిస్టు ప్రతి రోజూ భోజనం సరిగా అందించకపోడంతో విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రిన్సిపాల్ ఈ ఏడాది కొత్తగా టెండర్లు పిలిచి వారికి మెస్ అప్పగించడంతో పాత మెస్ ఇన్‌చార్జి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విద్యార్థులు ఫిర్యాదు చేయడానికి వచ్చారన్నారు. కానీ వారు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయారని రూరల్ ఎస్సై తెలిపారు.

# విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

పాన్‌గల్, ఏప్రిల్ 2: విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలని ఎంపీడీవో కోటేశ్వర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండలంలోని చిక్కేపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో 4, 5 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణిత సామర్థ్యాలు పరీక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# బహుజన విప్లవ వీరుడు పాపన్నగౌడ్

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి
- సర్దార్ పాపన్నగౌడ్‌కు ఘననివాళి

క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

శాంతినగర్‌లో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2: బహుజనులను ఏకం చేసి రాజ్యాధికారం కోసం పోరాటం చేసిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో గౌడ సంఘం, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్దార్ పాపన్న వర్ధంతిని వేర్వేరుగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, కౌన్సిలర్లు జయసుధ, లక్ష్మి రవి, సత్యంసాగర్, నాగన్నయాదవ్, భాషానాయక్, నారాయణ, మహేశ్, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు సతీశ్‌కుమార్, సత్యశీలారెడ్డి, జేఏసీ నాయకులు నర్సింహాశర్మ, ప్రజా సంఘాల నాయకులు దేవన్ననాయుడు, బండలయ్య, వెంకటస్వామి, వరప్రసాద్‌గౌడ్, నరేందర్‌గౌడ్, బాలేమియా తదితరులు పాల్గొన్నారు.

### పాపన్న స్ఫూర్తితో ఉద్యమించాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో బహుజనుల రాజ్యాధికారానికి ఉద్యమించడమే పాపన్నకు నిజమైన నివాళి అని కల్లుగీత కార్మిక, సహకార, గౌడ సంఘాల ప్రతినిధులు తిరుపతయ్యగౌడ్, అనంద్‌గౌడ్ అన్నారు. సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని మండల గౌడసంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీచౌక్‌లో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌గౌడ, నర్సింహులు గౌడ్, లచ్చన్నగౌడ్, శ్రీనివాసులుగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నరేందర్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, నర్సింహులుగౌడ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

### వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, ఏప్రిల్ 2: మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో మంగళవారం గౌడసంఘం మండలాధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో టీవీఎస్ షోరూం ఎదురుగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయిపాపన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ శివాజీ సర్వాయి పాపన్న స్ఫూర్తితో ముందుకెళ్లాలని, ప్రతి మండల కేంద్రంలో ఆయన విగ్రహాల ఏర్పాటుకు కృషిచేద్దామని, గౌడ కులస్తులు ఐక్యతగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడుదామన్నారు. కార్యక్రమంలో నాయకులు జయన్నగౌడ్, వెంకట్రామన్ గౌడ్, ఉస్సేన్, శ్రీనివాసులుగౌడ్, రామన్‌గౌడ్, మహేంద్ర గౌడ్, ఉరుకుందగౌడ్, కేశవరాంగౌడ్ పాల్గొన్నారు.

### ఖిల్లాఘణపురం మండలంలో ..

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 2 : బహుజన రాజ్యస్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు గోదా ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి మాధవ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు సత్యంగౌడ్, గౌడ సంఘం నేతలు టి.కృష్ణయ్యగౌడ్, ఆర్. మన్యంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిబాబుగౌడ్, మన్యం, ఎల్ల గౌడ్, చంద్రయ్యగౌడ్, యాదయ్యగౌడ్, నర్సింహాగౌడ్, ఆంజనేయులుగౌడ్,, రామన్‌గౌడ్, రామకృష్ణగౌడ్, రవిగౌడ్, నరేందర్‌గౌడ్, వెంకటరాములు, నాగరాజు, నర్సింహ, రాములు, మల్లేశ్, బాలు పాల్గొన్నారు.

# హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

గద్వాలటౌన్, ఏప్రిల్ 2 : హెచ్ఐవీ, ఏయిడ్స్ వ్యాప్తిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ సూచించారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం హెచ్ఐవీ, ఎస్‌టీఐపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ ఏవిధంగా సోకుతుంది, నివారణ మార్గాలు, వ్యాధి సోకిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించకుంటే వచ్చే వ్యాధులపై వివరించాలని చెప్పారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్ల సిఫిలిస్ గనేరియా మొదలైన వ్యాధులు వస్తాయన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్ప, మెడికల్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ల్యాబ్‌టెక్నిషియన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# సమీకృత పోషక నిర్వహణపై అవగాహన

మల్దకల్, ఏప్రిల్ 2 : మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్వంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా దృశ్య శ్రవణం ద్వారా సమీకృత పోషక నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మాధవి 'స్వీట్ కుకుంబర్' సాగుపై రైతులకు వీసీ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఏవో గోవిందనాయక్, ఏడీఏ సంగీత లక్ష్మి, ఏవో రాజశేఖర్, ఏఈవోలు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్, బళ్లారి రేంజ్ ఐజీపీ లోకేశ్‌కుమార్

మాట్లాడుతున్న జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, బళ్లారి రేంజ్ ఐజీపీ లోకేశ్‌కుమార్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 2 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక సరిహద్దు పోలీసు అధికారులు సమిష్టి గా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్, బళ్లారి ఐజీపీ లోకేశ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జోన్-7 జోగులాంబ డీఐజీ కార్యాలయంలో నిర్వహించిన అంతరాష్ట్ర సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మద్యం, నగదు అక్రమ రవాణా నియంత్రణపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. నిషేధిత మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. హైవే పెట్రోలింగ్‌తోపాటు మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీసు అధికారులు వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న సమస్మాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ గద్వాల, నారాయణపేట, రాయిచూరు ఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : ఎన్నికల నిర్వహించే సిబ్బంది ఈవీఎంల వినియోగం, వీవీ ప్యాట్‌లతో పాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీవో అధికారులు , సహాయ అధికారులు , ఎన్నికల రోజున నిర్వహించాల్సిన విధులపై ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. పలు సందేహాలకు అవగాహనకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని , ఇందులో ఏమైనా అనుమానాలు ఉంటే మాస్టర్ శిక్షకులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగం కోసం ఫాం-12 ను తప్పనిసరిగా నింపి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్వీలు ఉన్నారు.

### ఎండలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వనపర్తి, ఏప్రిల్ 2 : జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాశాఖాధికారులతో మంగళవారం వెబ్‌ఎక్స్ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు చేతిరుమాలు , టవల్ వినియోగించాలన్నారు.ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి సకాలంలో చికిత్స పొందాలన్నారు. ఎండ తీవ్రతకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ఎంపీడీవోలు, ఎంపీవోలు తాసీల్దార్లు ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధిక జన సంచారం ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లును అన్ని పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ, పాఠశాలలు, వసతి గృహాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉపాధి హామీ పనులు చేసే ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు , చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. పశువులు,ఇతర మూగ జీవాల దాహార్తి తీర్చేలా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు క్రమం తప్పకుండా నీరు పోయాలన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా రైతులకు తాగునీరు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెబెక్స్ సమావేశంలో డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, డీపీవో రమణామూర్తి, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్, డీడబ్ల్యూవో అధికారులు, ఎంపీడీవోలు, తాసీల్దార్లు, అర్‌డబ్ల్యూస్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

# అర్హులందరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

గద్వాల, ఏప్రిల్ 2 : 18 ఏండ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకొని ఓటును సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణిచౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు 5కే రన్ నిర్వహించగా దీనిని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో 5కే రన్ నిర్వహించినట్లు చెప్పారు. జాతి, కుల, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధి, ప్రగతి ప్రాతిపాదికన పనిచేసే ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి ఓటు హక్కు గొప్ప ఆయుధంలా పని చేస్తుందన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా ప్రజల్లో చైతన్యం తీసుకరావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు ఏప్రిల్ 15వరకు ఫారం-6 ద్వారా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యాసంస్థల్లో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఓటు ప్రాధాన్యతను వివరించే అవకాశం ఉంటుందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారందరూ మే3వ తేదీ వరకు ఓటు హక్కును వినియోగించుకునేలా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కొత్త ఓటర్లు ముఖ్యంగా యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాతబస్టాండ్‌లో జిల్లా అధికారులు, బీఎల్‌వోలు, మున్సిపల్ సిబ్బందితో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్, డీఆర్‌డీవో నర్సింగరావు, స్వీప్ నోడల్ అధికారి రమేశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శంకర్‌సింగ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్, అధికారులు వెంకటేశ్వర్లు, శ్వేత ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఓటు వేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్, ఉద్యోగులు

# కూలీలకు మస్టర్ ఇవ్వని అధికారులు

- ఆగ్రహం వ్యక్తం చేసిన కూలీలు
- ఉపాధి కార్యాలయం ఎదుట నిరసన

మల్దకల్, ఏప్రిల్ 2 : మండుటెండలో ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తే ఉపాధి అధికారులు మస్టర్లు ఇవ్వకుండా పనులు చేయించుకోవడంపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం ఎదుట కూలీలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వారి వివరాల ప్రకారం గతనెల 30న గ్రామానికి చెందిన మధు బ్లూఫాంలో 300మందికి కూలీలకు పనులు కేటాయించాలని కోరుతూ డిమాండ్ పత్రాన్ని ఉపాధి కార్యాలయంలో అధికారులకు అందజేశాడు. పనులు కేటాయించాలంటూ పంచాయతీ కార్యదర్శితో కూడా డిమాండ్ పత్రంపై సంతకాలు చేయించి ఉన్నతాధికారులకు అందజేశాడు. కాగా 1నుంచి 6వ తేదీ వరకు వారానికి సరిపోయే మస్టర్ ఇవ్వాల్సి ఉండగా ఉపాధి అధికారులు ఇవ్వకుండా పనులు మాత్రం చేయించారు. మస్టర్ ఇవ్వాలని అధికారులను అడగ్గా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వాపోయారు. కూలీలతో పాటు గ్రామంలో కొందరి వ్యక్తులకు డిమాండ్ ఇస్తూ వారికి మస్టర్లు ఇవ్వడం ఏమిటని మాకు ఎందుకు ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఏపీవో, టెక్నికల్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు వల్లే తమకు అన్యాయం జరిగిందన్నారు. వీరిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని గ్రామంలో అన్ని వర్గాలకు చెందిన కూలీలకు పనులు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంపీవో సౌజన్యను వివరణ కోరగా ఈ విషయం ఇప్పడే తన దృష్టికి వచ్చిందని ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకుంటామని ఈ రోజు నుంచి కూలీలందరికీ మస్టర్లు ఇస్తామని పనులు కల్పిస్తామన్నారు. అలాగే ఈ విషయంపై ఎంపీడీవో హరి కృష్ణ వివరణ కోరగా విషయం కూలీలు తన దృష్టికి తెచ్చారని కూలీలకు మస్టర్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసిన వారిని గుర్తించి పూర్తి విచారణ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మల్దకల్ ఉపాధి కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న ఉపాధి కూలీలు

# 'సైబర్' ఫిర్యాదులపై స్పందించాలి

- జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, ఏప్రిల్ 2 : సైబర్ నేరాలకు గురైన బాధితుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే సైబర్ వారియర్స్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్పీ రితిరాజ్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సైబర్ వారియర్స్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో సైబర్ నేరాల కేసుల్లో బాధితులకు న్యాయం చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం సైబర్ వారియర్స్‌కు మొబైల్ ఫోన్లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ గుణశేఖర్, సైబర్ సీఐ రాజు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### మెరుగైన సేవలు అందుబాటులోకి..

వనపర్తి టౌన్, ఏప్రిల్ 2 : సైబర్ బాధితులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎస్పీ రక్